

బాన్సువాడలో ఎమ్మెల్సీ కవితను గజమాలతో సత్కరించి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



# పోచారాన్ని ప్రజలు క్షమించరు

- కన్నతల్లిలాంటి పార్టీకి ద్రోహం చేశారు..
- పదేండ్ల పాలనలో కేసీఆర్ బాన్సువాడ నియోజకవర్గానికి రూ.పదివేల కోట్లు ఇచ్చారు..
- కాంగ్రెస్ పాలనలో ఏడాదికి వెయ్యి కోట్లు తీసుకురాగలరా?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- బాన్సువాడలో పర్యటించిన ఎమ్మెల్సీ
- ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు



బాన్సువాడలో అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న కవిత

బాన్సువాడ/ బాన్సువాడ టౌన్/ బాన్సువాడ రూరల్ 12: పార్టీ ఫిరాయించిన పోచారం శ్రీనివాసరెడ్డిని తెలంగాణ ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి ఆయన ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుభరోసా సాయం విషయంలో మాట మార్చిన కాంగ్రెస్ పార్టీలో పోచారం ఎందుకు కొనసాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైనా ఆ పార్టీలో ఎందుకు చేరారో చెప్పాలని నిలదీశారు. ఆదివారం ఆమె బాన్సువాడలో పర్యటించారు. బాన్సువాడ కొయ్యగుట్ట వద్ద అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కవితకు ఆటోలు, బతుకమ్మ, బోనాలతో, బ్యాండ్ మేళాలు, బైక్ ర్యాలీ, డీజే చప్పుళ్లతో గులాబీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్సీని గజమాలతో సత్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో బాన్సువాడ నియోజకవర్గానికి ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున కేసీఆర్ రూ.పదివేల కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదికి రూ.వెయ్యి కోట్లు పోచారం తీసుకురాగలరా అని ప్రశ్నించారు. ప్రజలకు పనికిరాని పార్టీ మారడం ఎందుకని ప్రశ్నించారు. కొంతమంది నాయకులు పార్టీ మారినా బీఆర్ఎస్‌తో ప్రజలు, కార్యకర్తలు ఉన్నారని అన్నారు. బాన్సువాడతో పాటు తెలంగాణ వ్యాప్తంగా గులాబీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

### హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కార్

రైతుల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోతల ప్రభుత్వమే కాని, చేతల ప్రభుత్వం కాదని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని రూ.12వేలే ఇస్తున్నారని మండిపడ్డారు. మహిళలు, ఆటో డ్రైవర్లు, కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ తుంగలోకి తొక్కిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. గడిచిన ఏడాది కాలంలో ఒక్క ప్రాజెక్టులో కూడా తట్ట మట్టికూడా ఎత్తిపోయలేదన్నారు. గురుకులాల్లో భోజనం సరిగ్గాలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో విషాహారం తిని విద్యార్థులు మృతి చెందినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ నాయకులు సత్యం పటేల్, షేక్ జుబేర్, మోచి గణేశ్, సాయిబాబా, గంగాధర్, శివసూరి, గౌస్, అఫ్రోజ్, సద్దాం, చాకలి సాయిలు, చాకలి మహేశ్, మౌలానా, రాము, నర్సింహులు గౌడ్, శ్రీను, కోటగిరి మధు, రుద్రూర్ మధుసూదన్ రెడ్డి, జలాల్ పూర్ ప్రవీణ్, శ్రీను, వర్ని ఏజాస్, మాజీ సర్పంచ్ దామరంచ విఠల్ పాల్గొన్నారు.





బాన్సువాడలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు

## బడాపహాడ్ దర్గాను సందర్శించిన ఎమ్మెల్సీ

### ప్రత్యేక పూజలు, ప్రార్థనలు

రుద్రూర్, జనవరి 12: ఉర్సులో భాగంగా వర్ని మండలం బడాపహాడ్‌లో ఉన్న హజ్రత్ సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గాను ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. స్థానిక, జిల్లా నాయకులతో కలిసి బడాపహాడ్ కు చేరుకున్న కవిత ముందుగా బుగ్గ రామాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మెట్లమార్గాన కాలినడకన దర్గాకు వెళ్లి సంధాల్, చాదర్‌ను సమర్పించారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ బాన్సువాడ నాయకులు జుబేర్, అశోక్, ఎజాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.





బడాపహాడ్ దర్గాకు కాలినడకన వెళ్తున్న ఎమ్మెల్సీ కవిత

## మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

- హామీలను మరిచిన ప్రభుత్వం
- చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలుచేయాలి
- బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీలకు పెద్దపీట
- ఏడాది రేవంత్ పాలనలో మత కల్లోలాలు
- షబ్బీర్ అలీతో జిల్లాకు ఒరిగిందేమీలేదు..
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరు



నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా


ఖలీల్‌వాడి, జనవరి 12: మైనార్టీల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మైనార్టీలపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఆదివారం ఆమె ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అర్సపల్లిలోని శైలజ గ్రౌండ్‌లో కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు హాజరయ్యారు. సారంగపూర్ సమీపంలో తబ్లిగి జమాతే ఇస్తేమా కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గాంధీల కుటుంబాన్ని చూసి మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని అన్నారు. మైనార్టీల నమ్మకాన్ని ఆ పార్టీ వమ్ముచేసిందని విమర్శించారు. గద్దెనెక్కేందుకే కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చిందన్నారు. ఎన్నికల్లో మైనార్టీలకు హామీలు ఇచ్చి మరిచిపోయారన్నారు. మైనార్టీ డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే మైనార్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ పాలనలో వెల్లివెరిసిన మత సామరస్యం

పదేండ్ల కేసీఆర్ పాలనలో మతకల్లోల జాడ కనిపించలేదని, రేవంత్ ఏడాది పాలన ఆందోళన కలిగిస్తుందన్నారు. మతకల్లోలాలు జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. గంగా జమునా తెహజీబ్‌లో ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారన్నారు. మైనార్టీ యువతులకు స్కూటీలతో పాటు షాదీముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ అమలుచేయడంలేదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల కోసం ప్రత్యేక గురుకులాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పుడు అక్కడ నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. మైనార్టీలకు బడ్జెట్‌లో కనీసం 25శాతం కూడా ఖర్చుచేయలేదన్నారు. బడ్జెట్‌లో రూ. 3వేల కోట్లు కేటాయించి, కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. షాదీ ముబారక్ కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, ఇప్పుడు ముఖం చాటేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి తనలో ఉన్న ఆర్ఎస్ఎస్ మూలాలతో రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని ఆరోపించారు.

### కేసీఆర్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట

మైనార్టీలకు పెద్దపీట వేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క బీఆర్ఎస్ మాత్రమే అని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో తబ్లిగి జమాతే ఇస్తేమా కార్యక్రమానికి కలెక్టర్ అన్ని ఏర్పాట్లు చేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు గుర్తుచేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా షబ్బీర్ అలీ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నా ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. హైదరాబాద్ తర్వాత అత్యధికంగా మైనార్టీలు ఉన్న నిజామాబాద్ అర్బన్‌కు షబ్బీర్‌అలీ అదనంగా రూపాయి కూడా ఇప్పించలేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా, నగర మేయర్ దండు నీతూకిరణ్, జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నగర అధ్యక్షుడు ఇమ్రాన్ షెహజాజ్, మాజీ జడ్పీటీసీ జగన్, నాయకులు పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్‌లో క్రికెట్ ఆడుతున్న కవిత

# ఏటీఎంలో చోరీ

- గ్యాస్ కట్టర్‌తో మిషన్ ధ్వంసం
- రూ.17.79 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు
- కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ఘటన



ఏటీఎం గదిలో సీసీ కెమెరాపై స్ప్రే చేస్తున్న దుండగుడు

పెద్ద కొడప్‌గల్, జనవరి 12: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి ఏటీఎంలోకి చొరబడిన దుండగులు గ్యాస్‌కట్టర్‌తో మిషన్ ధ్వంసం చేసి రూ.17.79 లక్షలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా పెద్దకొడప్‌గల్, బిచ్కుందకు వెళ్లే మార్గంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి శనివారం అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో దుండగులు చొరబడ్డారు. ముసుగుతో వచ్చిన దుండగులు సీసీ కెమెరాలపై స్ప్రే చేసి ముఖాలు కనబడకుండా చేశారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి రూ.17.79 లక్షలను ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని అదనపు అడిషనల్ ఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాజేశ్వర్ ఆదివారం పరిశీలించారు. పిట్లం మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోని సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఏటీఎం సూపర్‌వైజర్ రాచర్ల ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

## చేయని నేరం ఒప్పుకోవాలని వేధింపులు

### గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య

బోధన్ రూరల్, జనవరి 12 : చేయని నేరాన్ని ఒప్పుకోవాలంటూ ఓ కుటుంబం నుంచి వేధింపులు తాళలేక మనస్తాపంతో బోధన్ మండలం బండర్‌పల్లి గ్రామానికి చెందిన మాధవరావు (55) మంజీరా నదీలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సాలూరా మండలం జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు మాధవరావుతో పరిచయం ఉన్నది. గ్రామానికి చెందిన హరిబాబు ఇంట్లో రెండు వారాల క్రితం లక్ష్మి రూ.45 వేల నగదు దొంగలించింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెపై కేసు నమోదు చేశారు. చోరీ చేసిన డబ్బులు హరిబాబుకు చెల్లించాలని, లేని పక్షంలో ఆ చోరీ చేయమన్నది నీవేనని పోలీసులకు చెబుతానని మాధవరావును లక్ష్మి బ్లాక్‌మెయిల్ చేసింది. లక్ష్మితో పాటు ఆమె కొడుకు భూమయ్య, కోడలు రుక్మిణి కొద్ది రోజులుగా మాధవరావును వేధిస్తున్నారు. మనస్తాపానికి గురైన మాధవరావు.. ఈ నెల 9న తన కూతురుకు జరిగిన విషయం చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. కుటుంబ సభ్యులు ఆరోజు నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం అతడి మృతదేహం మంజీరా నదిలో నీటిపై తేలింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

# లోన్లు మాఫీ చేయిస్తానని డాక్టర్లకు కుచ్చుటోపీ

- లక్షల్లో వసూలు
- నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు



బంగారు అప్పారావు(ఫైల్)

వినాయక్‌నగర్, జనవరి 12 : బ్యాంకుల్లో ఉన్న రుణాలను మాఫీ చేయిస్తానని నమ్మబలికి డాక్టర్ల నుంచి లక్షల రూపాయలు తీసుకొని పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సదరు మోసగాడు తనకు రాజకీయ నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, పెద్ద పెద్ద వ్యక్తులు తెలుసని.. బ్యాంకుల్లో ఉన్న రుణాలను మాఫీ చేయిస్తానని డాక్టర్లను నమ్మించాడు. దీంతో డాక్టర్లు లక్షల రూపాయల్లో అప్పజెప్పారు. చివరికి మోసపోయామని గుర్తించిన వైద్యులు పోలీసులను ఆశ్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌లో ఉన్న బీరప్పనగర్, కేవీ రంగారెడ్డి కాలనీలో నివాసం ఉండే బంగారు అప్పారావు సింగరేణి వర్కర్. కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని దేవీ రోడ్డు ప్రాంతంలో ఉండే ఓ ప్రముఖ వైద్యుడికి బ్యాంకులో ఉన్న రూ. 50 లక్షల రుణాన్ని మాఫీ చేయిస్తానని నమ్మించాడు. సదరు డాక్టర్ నుంచి రూ.15 లక్షలు తీసుకొని, మోసం చేశాడు. ఇదేవిధంగా లోన్ సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన డాక్టర్ వద్ద రూ. 60 లక్షలు, నిజామాబాద్ మోర్తాడ్‌కు చెందిన డాక్టర్ వద్ద రూ.12 లక్షలు తీసుకున్నాడు. ఇలా చాలా మంది దగ్గర బ్యాంకు రుణాలు మాఫీ చేయిస్తానని నమ్మించి వారి నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు విచారణలో తేలిందని ఎస్‌హెచ్‌వో వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని దేవీరోడ్డుకు చెందిన డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, పరారీలో ఉన్న నిందితుడు బంగారు అప్పారావును ఆదివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో వసూలు చేసిన డబ్బులను సదరు నిందితుడు రియల్ఎస్టేట్స్‌లో, ,ఇతరులకు అప్పులు ఇవ్వడంతోపాటు కొన్ని ప్లాట్లను కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## అ'పూర్వ' సమ్మేళనం

*నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాధాకృష్ణ విద్యాలయంలో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలు, మధురస్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమత, లక్ష్మి, సునీత, రాజేశ్వర్, రాజు, శివప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.*

*-ఖలీల్‌వాడి, జనవరి 12*

